క్లుప్తంగా

అనాథలకు భోజనం

నల్లజర్ల: తూర్పు చోడవరంలోని షిర్డీ సాయిబాబా 20వ వార్షికోత్సవం సందర్భంగా నల్లజర్లలోని అనాథ పిల్లల ఆనంద నిలయం (బాలుర హాస్టల్)లో సోమవారం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉండవల్లి గోపి, సభ్యులు పులమోలు రమేష్, గుదే వెంకట సుబ్బారావు, సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో వజ్రోత్సవం



ఆర్‌సీఎం చర్చి దివ్యబలి పూజలో పాల్గొన్న ఏలూరు పీఠాధిపతి జయరావు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట ఆర్‌సీఎం చర్చి వజ్రోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఆధునీకరించిన చర్చి భవనాన్ని ప్రారంభించారు. ఈ చర్చి పురాతనమైనది కావడంతో దాతలు, భక్తుల విరాళాలు రూ.13 లక్షల వ్యయంతో ఇటీవల ఆధునీకరించారు. ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు చేతుల మీదుగా దివ్య బలిపూజ నిర్వహించారు. అంతకు ముందు బిషప్ జయరావుకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో విచారణకర్త డి.ఎలీషా, రెవరెండ్ ఫాదర్ బీవీ ప్రసాద్, రెవరెండ్ ఫాదర్ కల్యాణ్, అమృతరాజ్, బర్త్ లోమియా, మోజేస్, సంఘ పెద్దలు ప్రభాకరరాజు, తాడేపల్లి రాజు, గోళ్ల బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలి

చాగల్లు: ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్ సూచించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు.అన్ని గ్రామాల్లో పనులు చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో టీఏ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఎదుగుదలకు ప్రోత్సహించాలి

ఉండ్రాజవరం: జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత సోమవారం ఉండ్రాజవరంలోని మండల మహిళా సమాఖ్యకు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా మండలి సమాఖ్య పనితీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సంఘ సహాయకులను కలసి వివిధ రంగాల్లో మహిళల ఎదుగుదలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పి.లక్ష్మి, సెక్రటరీ పి.పద్మావతి, కోశాధికారి యు.సుబ్బలక్ష్మి, ఏపీఎం రత్నకుమార్, సీసీలు శేషారత్నం, సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు: ఒకరిని కొట్టి గాయపరిచిన అభియోగంపై మండలంలోని తోగుమ్మి గ్రామానికి కాకులపాటి ఆకాష్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేశామని కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కాకులపాటి చిరంజీవి అనే వ్యక్తి ఈనెల 19వ తేదీ రాత్రి భోజనం చేసి రోడ్డు పక్కన కూర్చుని ఓ మహిళతో మాట్లాడుతున్నాడు. ఇది నచ్చని ఆకాష్ చిరంజీవిని దుర్భాషలాడి, కొట్టి గాయపరచడమే గాకుండా అతడిపై మద్యం సీసాలు విసిరాడు. ఈ మేరకు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకాష్‌పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ జి.సతీష్ తెలిపారు.

టీవీ రిపోర్టర్లపై అట్రాసిటీ కేసు

గోపాలపురం: ఐదుగురు టీవీ రిపోర్టర్లపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ కొరివి రామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాదాలకుంటకు చెందిన పాముల నాగేంద్ర బాబు కనిపించడం లేదంటూ ఆయన భార్య విజయ రేఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు టీవీ రిపోర్టర్లు పెట్టే చిత్ర హింసలకు భరించలేక తన భర్త ఆత్మహత్యాయత్నం చేశారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది.

వృద్ధుడికి గాయాలు

చాగల్లు: మండలంలోని ఊనగట్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. రోడ్డు దాటుతున్న వృద్ధుడిని మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి ఢీ కొట్టాడు. వృద్ధుడికి చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు.

మాదక ద్రవ్యాలతో రుగ్మతలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ లక్ష్యం మేరకు 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్'సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు తీసుకుంటే అనేక రుగ్మతలు వస్తాయన్నారు.

మొక్కజొన్న.. రాబడికి బెంగ లేదన్న

- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో సాగు



తాడిపూడిలో ఖరీఫ్ వరి సాగు అనంతరం నేరుగా వేసిన మొక్క జొన్న

తాళ్లపూడి: పోషక విలువలు పుష్కలంగా ఉన్న పంట మొక్కజొన్న. రబీలో వరి సాగు చేయడానికి ఇష్టపడని కొవ్వూరు నియోజకవర్గంలోని మెట్ట ప్రాంత రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత భూములు సాగుకు అనుకూలంగా, పంట లాభసాటిగా ఉండడం ఇందుకు ప్రధాన కారణాలు. మొక్కజొన్నకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం మరో ముఖ్య కారణం. కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 3,200 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి పంట కోసిన తర్వాత మాగాణి మొక్కజొన్నను ఎక్కువగా వేస్తున్నారు. మండలంలోని తాళ్లపూడి, కుకునూరు, తాడిపూడి, అన్నదేవరపేట, గజ్జరం, పోచవరం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, పెద్దేవం, రావూరుపాడు తదితర గ్రామాల్లో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఒక్క తాళ్లపూడి మండలంలోనే సుమారు రెండు వేల ఎకరాల్లో సాగవుతోంది. కొవ్వూరు మండలంలోని చిడిపి, కుమారదేవం, పెనకనమెట్ట సావరం, చాగల్లు మండలంలోని మరో 1,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతేడాది కంటే మొక్కజొన్న సాగు విస్తీర్ణం కొంతమేర పెరిగింది.

కత్తెర పురుగుతో ఆందోళన

మొక్కజొన్న పంటను 2019లో కత్తెర పురుగు ఆశించింది. ఈ పురుగు సోకితే రాత్రికి రాత్రే పైరు మొత్తం తినేస్తుంది. ప్రస్తుతం కత్తెర పురుగు ఉధృతి తగ్గడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఖరీఫ్ వరి పైరును కోసిన రైతులు నేలను దున్నకుండా నేరుగా మొక్కజొన్న వేస్తున్నారు. రబీ మొక్కజొన్నను డిసెంబర్ నెలాఖరు నుంచి జనవరి మధ్య రైతులు సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఎరువుల యాజమాన్యం..

ముఖ్యంగా భారతి 3456, భారతి 99, పైనీర్, హైబ్రీడ్ మొక్కజొన్న వంగడాలను ఈ ప్రాంత రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నట్టు ఏవో జి.రుచిత తెలిపారు. నీటి తడులను బట్టి దీర్ఘకాలిక, స్వల్పకాలికంగా 120–90 రోజుల మధ్య పక్వానికి వచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవాలని ఆమె సూచించారు. రసం పీల్చే పురుగులు ఆశించకుండా కిలో విత్తనానికి ఐదు గ్రాముల ఇమిడా క్లోఫిడ్ అనే మందును విత్తే ముందు గింజలకు పట్టించాలన్నారు. మొక్కజొన్న సాళ్ల మధ్య దూరం 60–75, మొక్కల మధ్య 20–25 సెంటీమీటర్ల ఎడం ఉండేలా చూసుకోవాలన్నారు. ఎకరానికి 7–8 కిలోల విత్తనాలు సరిపోతాయని చెప్పారు.

జీరో టిల్లేజ్ పద్ధతిలో ఖర్చులు ఆదా ...

ఈ ప్రాంతంలో జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి చేలు కోసిన తరువాత నేరుగా మొక్కజొన్న విత్తనాలు చల్లుకోవడాన్ని మాగాణి మొక్కజొన్న సాగని, జీరో టిల్లేజ్ పద్ధతి అని అంటారు. ఈ విధానంలో భూమిని దున్నాల్సిన పని లేదు. దీంతో రైతులకు దుక్కి ఖర్చులు ఎకరానికి రూ.1200 నుంచి రూ.రెండు వేల వరకు ఆదా అవుతుంది. అంతేగాకుండా పంట కూడా ముందుగానే కోతకు వస్తుంది. పంట నీటి ఎద్దడిని కూడా తట్టుకోగలుగుతుంది. తక్కువ నీటి తడులు అవసరమవుతాయి. ముఖ్యంగా గింజ పాలుపోసుకునే దశలోను, పూత దశలోను నీరు ఎక్కువ అవసరం.తాడిపూడి, తాళ్లపూడి, పోచవరం, అన్నదేవరపేటలలో ఈ విధానంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

ధర ఆశాజనకం...

మొక్కజొన్నకు రేటు కూడా ఆశాజనకంగా ఉంది. క్వింటాల్‌కు గతేడాది రూ.1860 చెల్లించినట్టు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది రూ.1950 వరకూ రేటు ఉందని అంటున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. కొన్నిచోట్ల పొత్తులు వేసే దశకు చేరుకుంది.

గిట్టుబాటు ధర లభిస్తోంది



మొక్కజొన్న పంటను తక్కువ సమయంలో, తక్కువ పెట్టుబడితో సాగు చేయడం వల్ల రైతులకు లాభసాటిగా ఉంటుంది. ఇతర పంటల కంటే కూడా కూలీలు, ఇతర ఖర్చులు తక్కువ. అందుకే రబీలో వరికి బదులు మొక్కజొన్న సాగుచేస్తున్నాం.

– కాకర్ల సతీష్, రైతు, పోచవరం

అధికారుల సలహాలు పాటించాలి



అధికారుల సూచనల మేరకు పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చు. సక్రమంగా ఎరువులు యాజమాన్యం చేపట్టాలి. కత్తెర పురుగు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇప్పుడు కత్తెర పురుగు ఉధృతి అంతగా లేదు. ప్రభుత్వం కూడా మద్దతు ధర కల్పించింది.

– జి రుచిత, ఏవో, తాళ్లపూడి

పొగాకు బ్యారన్ దగ్ధం



దగ్ధమైన పొగాకు బ్యారన్

నల్లజర్ల: పోతవరంలో ప్రమాదవశాత్తూ పొగాకు బ్యారన్ దగ్ధమైంది. రైతు ప్రత్తిపాటి సత్యనారాయణకు చెందిన బ్యారన్‌లో క్యూరింగ్ జరుగుతూండగా కింద పడి ఆకులకు నిప్పంటుకుని, బ్యారన్ మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 8 క్వింటాళ్ల పొగాకు, సామగ్రి పూర్తిగా దగ్ధమై, రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగిందని సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇన్సూరెన్స్ అధికారి సీతారామ్ ఏలూరు నుంచి వచ్చి వివరాలు సేకరించారు.

నేడు నిడదవోలులో విద్యుత్తుకు అంతరాయం

నిడదవోలు రూరల్: పట్టణంలో విద్యుత్ వైర్ల మరమ్మతుల కోసం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, రాధాకృష్ణ థియేటర్ రోడ్, బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం ఏరియా, ఇందిరా నగర్, రాయిపేట, జెండాలవీధి, పోస్టాఫీస్ రోడ్, సుబ్బరాజుపేట, జ్యోతి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సింగవరం, తీరుగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చివటంలో భారీ అన్నదానం

ఉండ్రాజవరం: శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని చివటం గ్రామంలో సోమవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన కరుటూరి ఇంద్రయ్య ఆర్థిక సహకారంతో సుమారు రూ.మూడు లక్షల వ్యయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. చివటం వాసులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానానికి విఘ్నాలు కలగకుండా కార్యక్రమానికి ముందు వాన దేవునికి నేతి బూరెలతో నైవేద్యం సమర్పించినట్టు నిర్వాహకులు తెలిపారు.

చాగల్లు శివాలయం వద్ద..

చాగల్లు: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం చాగల్లు శివాలయం వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. చాగల్లు, మీనానగరం, నెలటూరు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారికి ఆలయ అర్చకుడు చెరుకూరి శివసీతారామశాస్త్రి పూజలు నిర్వహించారు. కాగా బ్రాహ్మణగూడెంలో శివాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ మహిళలు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.స్వామి వారిని కొత్త వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు.

అనంతపల్లిలో..

నల్లజర్ల: అనంతపల్లిలోని బాలాత్రిపుర సుందరీ సమేత వేగిలింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. దాదాపు నాలుగు వేల మంది భక్తులు భోజనాలు చేశారు. గత మూడు రోజులుగా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, విశేష పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిక్కాల నాగేశ్వరరావు,ఈఓ ఎం.లక్ష్మీశరణ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా త్రిశూల స్నానం

వేడుకగా శివయ్యకు వసంతోత్సవం



ద్వారకాతిరుమల క్షేత్ర వీధుల్లో రుద్రాక్ష మండప వాహనంలో ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఆలయ అర్చకుడు తీర్థపు బిందె, నిత్యహోమం, బలిహరణ, గణపతి పూజ అనంతరం స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ఆవరణలో శివయ్యకు త్రిశూల స్నానాన్ని అట్టహాసంగా జరిపారు. అనంతరం రుద్రాక్ష మండప వాహనంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి వసంతోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. రాత్రి ఆలయంలో స్వామివారికి 21 పర్యాయాలు పల్లకీ సేవ నిర్వహించారు. మంగళవారం రాత్రి జరగనున్న శ్రీ పుష్ప యాగోత్సవంతో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

గోలింగేశ్వరస్వామి గుడిలో పుష్ప యాగోత్సవం



గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పుష్ప యాగోత్సవంలో పాల్గొన్న భక్తులు

నిడదవోలు రూరల్: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పురాతన శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయం, బాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం రాత్రి పుష్పయాగోత్సవం, ఊయల సేవ ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. కుంకుమ పూజలు, నిత్యోపాసన త్రిశూల స్నానం పూర్ణాహుతి జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొండాటి గంగరాజు, ప్రధానార్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఈఓలు నామా సూర్యప్రకాశరావు, సోమాల శివలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉమా కాటకూటేశ్వరునికి అభిషేకాలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి సోమంవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాలకొల్లు మధు ఈవెంట్స్ వారి మ్యాజిక్ షో, కామెడీ షో, టాకింగ్ డాల్, రింగ్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. మంగళవారం స్వామివారి ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

'స్పందన'కు ఆరు అర్జీలు



కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబుకు అర్జీలు అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయని ఆర్డీవో ఎస్.మల్లిబాబు వెల్లడించారు. పీర్ల పండగ చేసుకునే భవనాన్ని ఖాళీ చేయించి ఇప్పించాలని చాగల్లుకు చెందిన అహ్మద్ అలీబేగ్ కోరారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో ఓ వ్యక్తి అక్రమంగా స్థలం పొంది, ఇంటి నిర్మాణం సాగిస్తున్నందున, ఆ పనులను నిలుపుదల చేయాలని ముదుదుడ్డి బాపనమ్మ ఫిర్యాదు చేశారు. తన తండ్రికి చెందిన భూమి వేరొకరి పేరున ఆన్‌లైన్ అయినందున, రికార్డుల్లో దానిని సరి చేయించాలని తాళ్లపూడి మండలం పెద్దేవానికి చెందిన దున్నా చిన్నయ్య కోరారు. ఆర్ అండ్ బీ డ్రైన్ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దేవరపల్లికి చెందిన కేశిరాజు కాశీ విశ్వనాథం అర్జీ అందజేశారు.గోపాలపురం మండలం వాదాలకుంటలోని సర్వే నంబర్ 476లో తాను రెండెకరాల భూమిని కొనుగోలు చేస్తే రికార్డుల్లో ఖాతా నంబర్ తొలగించారని, తన భూమి వివరాలను ఆన్‌లైన్ చేయించాలని అదే గ్రామానికి చెందిన ఆచంట రంగారావు ఆర్డీవోకు అర్జీ అందించారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



నామమాత్రంగా వచ్చిన భక్తులు

ద్వారకాతిరుమల: స్థానిక చిన వెంకన్న ఆలయంపై సోమవారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు నామమాత్రపు భక్తులతో కనిపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వల్ప సంఖ్యలోనే భక్తులు స్వామివారిని దర్శించారు. దాంతో ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తులు సాధారణంగా ఉన్నారు. మంగళవారం సైతం ఆలయంలో భక్తుల రద్దీ నామమాత్రంగానే ఉండొచ్చని ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

22 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: గంజాయితో నలుగురిని అరెస్ట్ చేసినట్లు బొమ్మూరు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం స్పిన్నింగ్ మిల్లు కాలనీకి చెందిన గెద్దాడ మనోజ్, హుకుంపేటకు చెందిన తోట వినయ్, అయ్యప్పనగర్‌కు చెందిన కోట తులసీరామ్, ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌కు చెందిన దొంగా సాదీరాజులు విశాఖ ప్రాంతం నర్సీపట్నంలో గంజాయిని కిలో రూ.వెయ్యి చొప్పున 22 కిలోలు కొనుగోలు చేశారు. దానిని శాటిలైట్ సిటీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద విక్రయించేందుకు సిద్ధమవుతుండగా బొమ్మూరు ఎస్సై శివాజీ, సిబ్బందితో దాడి చేశారు. ఆ నలుగురిని అరెస్ట్ చేశారు.

సొంతింటి కలకు డ్వాక్రా సాయం

- గృహ లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘుల మహిళలకు రూ.35 వేల రుణం
- నియోజకవర్గంలో 11,164 కుటుంబాలకు లబ్ధి



సమిశ్రగూడెం వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్నగృహాలు

నిడదవోలు రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి వైఎస్సార్ జగనన్న కాలనీలుగా లే అవుట్లను తీర్చిదిద్దింది. అక్కడితో ఆగకుండా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన వనరులను సమకూరుస్తోంది. లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులకు ప్రభుత్వం బాసగా నిలుస్తూ ముందస్తు సాయం అందిస్తోంది. అంతేగాకుండా వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తిచేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రూ.35 వేలు అదనపు సాయంగా అందిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.18.74 కోట్ల రుణాన్ని బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అదనపు సాయంగా అందించారు. నిడదవోలు నియోజకవర్గంలో 11,164 ఇళ్లు మంజూరు కాగా 6,510 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే 4,606 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారు.

నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా..

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా డ్వాక్రా సంఘ సభ్యులైన లబ్ధిదారులకు రూ.35 వేల వరకూ పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనిపై ఆరు శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. బ్యాంకులు ఇచ్చే రుణాన్ని 36 సులభ వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. దీనిపై కలెక్టర్ మాధవీలత ప్రత్యేక దృష్టి పెట్టడంతో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేస్తోంది.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి మెటీరియల్ సమకూర్చుకుంటే రూ.15 వేలు, బేస్‌మెంట్ పూర్తిచేస్తే మెటీరియల్ బిల్లును అందించడంతో పాటు ప్రోత్సాహకంగా మరో రూ.10 వేలు అందజేస్తారు. గతంలో పునాది పూర్తి చేస్తేనే రూ.70 వేలు అందించేవారు. ప్రస్తుతం ముందుగా నిధులు కేటాయించడం ద్వారా నిర్మాణదారులకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.రాయితీపై మెటీరియల్‌తో పాటు గృహనిర్మాణం పూర్తి చేసేందుకు 90 బస్తాల సిమెంట్ బస్తాలను అందజేస్తున్నారు. ఈ సొమ్ములోనే అర టన్ను ఐరన్ సరఫరా చేస్తోంది. అదనంగా 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందజేస్తోంది.

నియోజకవర్గంలోని ఇళ్ల నిర్మాణాల వివరాలు..

మండలం	మంజూరైనవి	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయినవి
నిడదవోలు మండలం	3,217	2,015	1,164
నిడదవోలు పట్టణం	3,020	2,087	937
పెరవలి	1,948	734	1,206
ఉండ్రాజవరం	2,979	1,679	1.299

అదనపు సాయంతో ఇళ్లను పూర్తిచేశాం..



జగనన్న గృహ లబ్ధిదారులకు హౌసింగ్ నుంచి వచ్చే బిల్లులతో పాటు బ్యాంకుల ద్వారా రూ.35 వేల రుణం ఇవ్వడంతో గృహ నిర్మాణం పూర్తి చేసేందుకు ఎంతో ఉపయోగపడింది. హౌసింగ్ బిల్లులు కూడా సకాలంలోని బ్యాంకు ఖాతాలో వేశారు. ముఖ్యమంత్రి జగన్ వల్ల నా సొంతింటి కల సాకారమైంది.

– గోపిశెట్టి పోశమ్మ, డ్వాక్రా మహిళ, సమిశ్రగూడెం

సకాలంలో బిల్లులు చెల్లించేలా..



ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు చాలా వేగవంతంగా జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో దశలవారీగా త్వరితగతిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నాం.ప్రస్తుతం 90 బస్తాల సిమెంట్, ఇనుముతో పాటు ఉచితంగా ఇసుక అందిస్తున్నాం. ఇంటి లబ్ధిదారులకు రూ.35 వేల రుణం అదనంగా అందించడంతో నూరుశాతం లక్ష్యం పూర్తి చేసేలాకృషి చేస్తున్నాం.

– ఎస్.చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ, నిడదవోలు

స్వయం ఉపాధికి మెప్మా బజార్లు

రాజమహేంద్రవరం సిటీ: వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన రాజమహేంద్రవరంలో త్వరలో మెప్మా బజార్లు ఏర్పాటు చేయాలనే యోచన ఉన్నట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడించారు. సోమవారం స్థానిక 47వ డివిజన్ టీవీ రోడ్డులో మహిళల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది అక్కా చెల్లెళ్లు తీసుకున్న రూ.25 వేల కోట్లను మాఫీ చేసే బాధ్యతను సీఎం జగన్ తీసుకుని దఫదఫాలుగా బ్యాంకులకు చెల్లిస్తున్నారన్నారు. ఇప్పటికి రెండు విడతలు చెల్లించగా మూడో విడతగా మరో రూ.6,500 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. దీనివల్ల నగరంలో 128 గ్రూపుల సభ్యులు లబ్ధి పొందారన్నారు. మరో అడుగు ముందుకు వేసి నగరంలో పలు ప్రధాన సెంటర్లలో మెప్మా బజార్లను ఏర్పాటు చేసి, మహిళలు తయారు చేసిన తినుబండారాలు, వివిధ రకాల ఉత్పత్తులను విక్రయించాలనేది ఈ మెప్మా బజార్ల లక్ష్యమన్నారు. గత ఎన్నికలలో చేసిన పొరపాటు మరోమారు చేయకుండా నగరంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి అంతా కృషి చేయాలని కోరారు.